# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అసోం సహా మొత్తం ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు భారతదేశానికి అష్టలక్ష్మిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- ❖ రైళ్లలోని జనరల్ కోచ్‌లను ఇకపై ఫస్ట్ క్లాస్ కోచ్‌లకు సరి సమానంగా శుభ్రం చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.
- ❖ మహిళలకు అన్ని రంగాల్లోనూ సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు.

==============================

అసోం సహా మొత్తం ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు భారతదేశానికి అష్టలక్ష్మిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. అసోంలో ఈరోజు పర్యటించిన ప్రధానమంత్రి.. 5 వేల 450 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. గువాహతిలో... బ్రహ్మపుత్ర నదిపై గువాహతి, ఉత్తర గువాహతిని కలుపుతూ 3 వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన "కుమార్ భాస్కర్ వర్మ సేతు"ను ప్రారంభించారు. కామ్రూప్ జిల్లాలోని అమింగావ్‌లో ఐఐఎం గువాహతి తాత్కాలిక క్యాంపస్‌ను, ఈశాన్య ప్రాంతం కోసం జాతీయ డేటా సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం గువాహతిలో విజయ సంకల్ప సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ.. గత 11 సంవత్సరాలుగా ఈశాన్య ప్రాంతాలకు 5.5 లక్షల కోట్ల రూపాయలకు పైగా కేటాయించామని, వీటితో ఈ ప్రాంతం మౌలిక సదుపాయాల రంగాలలో అపూర్వమైన అభివృద్ధి సాదించిందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అంతకుముందు ప్రధాని దిబ్రూఘర్ జిల్లాలోని జాతీయ రహదారి వెంబడి అభివృద్ధి చేయబడిన మోరన్ బైపాస్‌లో అత్యవసర ల్యాండింగ్ సౌకర్యాన్ని ప్రారంభించారు. యుద్ధ, రవాణా విమానాలు, హెలికాప్టర్ల వైమానిక ప్రదర్శనను తిలకించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల పరిధిలోని 12 జిల్లాలను కలిపే మూడు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో భారతీయ రైల్వే నెట్‌వర్క్ సుమారు 389 కిలోమీటర్లు పెరగనుంది. అసోంలో బ్రహ్మపుత్ర నది కింద 33.7 కిలోమీటర్ల పొడవైన రెండు వరుసల ట్విన్ ట్యూబ్ టిబిఎం రహదారి, ఒక ట్యూబ్‌లో రైల్వే మౌలిక సదుపాయాలు వుండేలా నీటి దిగువన సొరంగ మార్గం (అండర్ వాటర్ టన్నెల్)ను నిర్మించేందుకు ఆమోదం తెలిపారు. నోయిడా సెక్టార్ 142 నుంచి బొటానికల్ గార్డెన్ వరకు 11.56 కిలోమీటర్ల పొడవున 8 స్టేషన్లతో కారిడార్ విస్తరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. టెక్-ఆధారిత వినూత్న తయారీ అంకుర సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు 10 వేల కోట్ల రూపాయల కార్పస్ నిధి ఏర్పాటు, హైదరాబాద్-పనాజీ ఆర్థిక కారిడార్‌లోని గూడెబెల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు ఉన్న జాతీయ రహదారి-167ని తెలంగాణలో 4 వరుసలుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పుల్వామా ఉగ్రవాద దాడిలో ప్రాణాలు అర్పించిన అమరజవాన్లకు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు నివాళులర్పించారు. 2019, ఫిబ్రవరి 14న పుల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడి జరిగిన ఘటనలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. భద్రతా సిబ్బంది త్యాగం దేశ స్మృతిపథంలో ఎప్పటికీ నిలిచి ఉంటుందని ఉప రాష్ట్రపతి తెలిపారు. అమరవీర జవాన్ల అంకితభావం, సంకల్పం దేశానికి చేసిన సేవ శాశ్వతంగా నిలిచి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మాతృభూమి సార్వభౌమత్వం, సమగ్రత కోసం గొప్ప త్యాగం చేసిన ధీర జవాన్లు, వారి కుటుంబాలను చూసి భారత్ ఎల్లప్పుడూ గర్వపడుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. అమర జవాన్ల కుటుంబాలకు దేశం అన్ని వేళలా మద్దతుగా ఉంటుందని రక్షణ శాఖా మంత్రి రాజనాథ్ సింగ్ చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాచార సాంకేతికత (IT), డేటా సెంటర్లు, కృత్రిమ మేథ (AI) వంటి రంగాలలో పుదుచ్చేరి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. పుదుచ్చేరిలోని కారైకాల్‌లో ఈరోజు జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ... కేంద్ర పాలిత ప్రాంతంలోని మత్స్యకారులు ప్రపంచ మార్కెట్లను చేరుకోవడానికి, తద్వారా వారి ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల రైతులకు, పాడి పరిశ్రమకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అమిత్ షా స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళలకు అన్ని రంగాల్లోనూ సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మహిళా, శిశు సంక్షేమాభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన "పని ప్రదేశాల్లో మహిళల భద్రత"పై జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. పని ప్రదేశాల్లో మహిళలు తమ ఫిర్యాదులను సులభంగా నమోదు చేసేందుకు `షీ-బాక్స్` (SHe-Box) పోర్టల్ ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. భారతదేశం `వికసిత్ భారత్` దిశగా సాగిస్తున్న ప్రయాణంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైళ్లలోని జనరల్ కోచ్‌లను ఇకపై ఫస్ట్ క్లాస్ కోచ్‌లకు సరి సమానంగా శుభ్రం చేయనున్నట్లు రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. న్యూఢిల్లీలో రైల్వే సంస్కరణలపై ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. రాబోయే ఆరు నెలల్లో 80 సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను గుర్తించి.. ఈ మెరుగైన శుభ్రతా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. ప్రతి గంట నుండి గంటన్నర వ్యవధిలో కోచ్‌లను శుభ్రం చేయడానికి ఈ రైళ్లలో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తామని కేంద్రమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మ్యూనిక్ భద్రతా సమావేశంలో కీలక కార్యక్రమాల్లో పాల్గొనడానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ జర్మనీకి ఈరోజు చేరుకున్నారు. మ్యూనిక్ విమానాశ్రయంలో భారత కాన్సుల్ జనరల్ శత్రుఘ్న సిన్హా ఆమెకు స్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక, వ్యూహాత్మక అంశాలపై దృష్టి సారించే ముఖ్యమైన ప్యానెల్ చర్చలలో కేంద్రమంత్రి కూడా పాల్గొంటారని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సమావేశం సందర్భంగా వివిధ దేశాల మంత్రులతో  పాటు ప్రముఖ సంస్థల అధిపతులతో ద్వైపాక్షిక సమావేశాలను ఆర్థిక మంత్రి నిర్వహిస్తారు. పరస్పర ఆసక్తి ఉన్న విషయాలను చర్చించి ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ 16 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. అంతకుముందు కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో స్కాట్‌లాండ్ జట్టుపై ఇంగ్లాండ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అదే విధంగా కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఒమన్ జట్టుపై ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో గెలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధ... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పై ప్రపంచ సహకారంలో భాగంగా "ఇండియా-AI ఇంపాక్ట్ సమ్మిట్-2026" ఈ నెల 16 నుండి 20 వరకు న్యూఢిల్లీలో జరుగనుంది.  20 దేశాల నాయకులు, 45కి పైగా దేశాల నుండి మంత్రివర్గ ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరు కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =